
సాక్షి అనంతపురం
గురువారం । 27 । మార్చి । 2025



చీనీ టన్ను రూ.25,500
అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25,500 పలికాయి.



టమాట కిలో రూ.8
అనంతపురం కక్కలపల్లి మండీలో బుధవారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 6, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



న్యూస్‌రీల్

15 శాతానికి పైగా వృద్ధికి ప్రణాళిక

- సీఎం కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: జిల్లా అన్ని రంగాల్లో 15 శాతానికి పైగా వృద్ధి సాధించేందుకు ప్రణాళిక రూపొందించామని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. అమరావతిలో కలెక్టర్లతో సీఎం చంద్రబాబు నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో బుధవారం కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 35 వేల హెక్టార్లకు సేంద్రియ వ్యవసాయాన్ని విస్తరించడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఖనిజ ఆదాయాన్ని రూ.70 కోట్లకు పెంచుతామన్నారు. తయారీ రంగం కింద రెండు పెద్ద యూనిట్లు, పలు ఎంఎస్ఎంఈ యూనిట్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యాటకం కింద మూడు క్లస్టర్లను, మూడు సర్క్యూట్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గుత్తి కోటలో సాహస క్రీడలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు చర్యలు చేపడుతున్నామన్నారు. బ్యాంకింగ్ రంగం నుంచి రూ.23 వేల కోట్ల రుణ సదుపాయం కల్పించేలా ప్రణాళిక చేపట్టామన్నారు.

వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా 'విశ్వ'



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యునిగా ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి నియమితులయ్యారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం బుధవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. అలాగే, అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి చెందిన ఎం.లక్ష్మీనారాయణను పార్టీ జిల్లా ఎంప్లాయీస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షునిగా నియమించారు.

- రాయదుర్గం నగరంలో మంగళవారం ఎస్‌బీఐ ఏటీఎం మంటల్లో కాలిపోయింది. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్‌తో ఈ ఘటన చోటుచేసుకుంది. భారీగా ఆస్తి నష్టం సంభవించింది.
- నాలుగు రోజుల క్రితం గార్లదిన్నె సమీపంలోని కల్లూరు వద్ద ఓ లారీ కంటెయినర్‌లో మంటలు చెలరేగాయి. అదృష్టవశాత్తు ప్రాణ నష్టం జరగలేదు. అదే జన సమూహంలో మంటలు చెలరేగి ఉంటే పరిస్థితి మరోలా ఉండేది.
- రెండు నెలల క్రితం అనంతపురం నగరంలో ఓ వృద్ధురాలు వంట చేస్తుండగా గ్యాస్ లీకేజీతో మంటలు చెలరేగాయి. గాయాలపాలైన బాధితురాలు అక్కడికక్కడే మృతి చెందింది. ఇవే కాదు.. ఇటీవల జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో నిత్యం చోటు చేసుకుంటున్న అగ్ని ప్రమాదాలు భయాందోళన కలిగిస్తున్నాయి.

అగ్ని గండం.. పారాహుషార్

- 10 నెలల్లోనే 500కు పైగా అగ్ని ప్రమాదాలు
- ఎక్కువగా గ్యాస్, ఎలక్ట్రిక్ వస్తువుల వల్లే..
- భారీగా ఆస్తి నష్టం
- మరో మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు



షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంగళవారం రాయదుర్గంలోని ఏటీఎం సెంటర్‌లో చెలరేగిన మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది, (ఇన్‌సెట్) దగ్ధమైన ఏటీఎంలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా 10 నెలల్లోనే 500కు పైగా అగ్ని ప్రమాదాలు జరిగినట్టు అగ్నిమాపక శాఖ లెక్కల్లో తేలింది. పల్లెల్లో కంటే పట్టణాల్లోనే ఎక్కువగా అగ్ని ప్రమాద ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. సాధారణంగా గ్రామాల్లో గడ్డివాములు, ఎండిపోయిన పైర్లు వంటి వాటి వల్ల ప్రమాదాలు జరిగేవి. కానీ నేడు గ్యాస్ లీకేజీ, ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్‌ల కారణంగా 70 శాతం ప్రమాదాలు పట్టణాల్లో జరుగుతుండడం గమనార్హం.

ఆస్తి, ప్రాణ నష్టం..

ఎలక్ట్రిక్ పోల్స్, లైన్‌లు, వైరింగ్ సరిగా లేకపోవడం తదితర కారణాల వల్ల ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటి నిర్వహణ విషయంలో విద్యుత్ అధికారులు దారుణంగా విఫలమవుతున్నట్లు తెలుస్తోంది. ఇక.. పట్టణాల్లోని చాలా ఇళ్లలో వెంటిలేషన్ సరిగా లేకపోవడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నట్టు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే కోట్లాది రూపాయల ఆస్తి నష్టం జరుగుతున్నట్టు అంచనా. అంతే కాకుండా ఈ ఏడాది ఏడుగురు వ్యక్తులు అగ్ని ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడైంది.


గార్లదిన్నె మండల పరిధిలోని కల్లూరులో లారీలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

జాగ్రత్తలు పాటించాలి..

ఎండ తీవ్రతకు వాహనాలు విపరీతంగా వేడెక్కి వాటి నుంచి మంటలు చెలరేగుతున్నాయి. మూడు మాసాల క్రితం బెంగళూరు హైవేలో కారులో మంటలు వ్యాపించి కాలిపోవడమే ఇందుకు ఉదాహరణ. ఈ క్రమంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మేలని నిపుణులు సూచిస్తున్నారు.

- వెలుతురు సరిగా లేని ఇళ్లలో రాత్రి గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి రెగ్యులేటర్ ఆఫ్ చేయాలి.
- సిలిండర్‌లు ఆన్‌లో ఉంచి కిచెన్‌లో లైట్లు వేయకూడదు.
- ఎలక్ట్రిక్ స్విచ్‌లు వేస్తున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలి.
- కరెంటు పోళ్ల వద్ద విద్యుత్ ఎర్త్ అవుతుందేమో గమనిస్తూ చూడాలి.
- ఏసీలు, హీటర్లు వాడుతున్నప్పుడు నిప్పు రవ్వలు చెలరేగుతున్నాయేమో గమనించాలి.
- బండి ఇంజిన్ వేడెక్కినప్పుడు కాస్త విరామం ఇవ్వాలి.

అప్రమత్తంగా ఉండాలి



గ్యాస్, ఎలక్ట్రిక్ కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయి. వేసవి నేపథ్యంలో మరో మూడు నెలలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వంట పూర్తవగానే సిలిండర్ ఆపేస్తే మంచిది. ఎలక్ట్రిక్ వస్తువులపై నిఘా ఉంచాలి. ఇరుకు గదుల్లో ఉండే దుకాణదారులు, షాపింగ్ మాల్స్ యజమానులు నిరంతరం చెక్ చేసుకుంటూ ఉండాలి.
– శ్రీనివాసులు రెడ్డి, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి

జిల్లాలో ఫైర్ స్టేషన్లు	06
ఫైర్ వాహనాలు	08
ఈ ఏడాది సాధారణ అగ్ని ప్రమాదాలు	448
మధ్యస్థ	67
భారీ అగ్ని ప్రమాదాలు	10
ప్రమాదాల్లో ఆస్తి నష్టం	రూ.36,92,22,065
మృతి చెందినవారు	7

విద్యార్థినికి 'విషమ పరీక్ష!'

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృత్యువాత
- పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు హాజరైన కుమార్తె


పరీక్ష రాసేందుకు వెళ్తున్న రక్షిత

ఉరవకొండ: తండ్రి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడు. అయినా, దుఃఖాన్ని దిగమింగుకుని పదో తరగతి పరీక్షలకు హాజరైంది ఓ విద్యార్థిని. అల్లారు ముద్దుగా పెంచిన తండ్రి లేడు.. ఇక రాడు అన్న బాధను దిగమింగుకుని పరీక్ష రాసింది. వివరాలు.. మండల పరిధిలోని రాకెట్ల గ్రామానికి చెందిన మదమంచి రాఘవేంద్ర, లలిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె మదమంచి ప్రణతి అనంతపురంలో ఎంసెట్ కోచింగ్ తీసుకుంటోంది. రెండో కుమార్తె రక్షిత అనంతపురంలోని ఓ ప్రయివేట్ స్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఈ నెల 25న పెద్ద కుమార్తె ప్రణతిని అనంతపురంలోని ఎంసెట్ కోచింగ్ సెంటర్‌లో వదిలి స్వగ్రామానికి తిరుగుపయనమైన రాఘవేంద్ర.. బ్రహ్మణపల్లి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. ఇంటి పెద్ద మృతితో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ క్రమంలోనే పుట్టెడు దుఃఖంలోనూ బుధవారం జరిగిన పదో తరగతి పరీక్షకు రక్షిత హాజరైంది. తండ్రి లేడన్న బాధను దిగమింగుకుని పరీక్ష రాసింది.

అభ్యంతరాలుంటే 27లోపు తెలియజేయండి

అనంతపురం మెడికల్: ఫీమేల్ నర్సింగ్ ఆర్డర్లీ, శానిటరీ అటెండర్, వాచ్‌మెన్ పోస్టుల భర్తీ అంశంపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 27లోపు తెలియజేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ. భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. అనంతపురం వెబ్‌సైట్‌లో ప్రొవిజినల్ మెరిట్ లిస్టును ఉంచినట్లు తెలిపారు. వివరాలకు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రామగిరిలో రౌడీరాజ్యం

- రెచ్చిపోయిన పరిటాల అనుచరులు
- వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీడీఓపై దాడి
- ఎంపీపీ ఎన్నిక అడ్డుకోవాలని కుట్రలు
- రామగిరికి వెళ్తుండగా సోమందేపల్లి వద్ద తోపుదుర్తిని అడ్డగించిన పోలీసులు


వైఎస్సార్‌సీపీ నేతల వాహనాన్ని ధ్వంసం చేసిన టీడీపీ గూండాలు


సోమందేపల్లిలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి, పుట్టపర్తి : మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అనుచరులు రెచ్చిపోయారు. 'రామగిరి అంటే రౌడీ రాజ్యం.. పరిటాల రాజ్యాంగం అమల్లో ఉంటుంది' అన్న రీతిలో కల్లోలం సృష్టించారు. నేడు (మార్చి 27) జరగబోయే రామగిరి ఎంపీపీ ఎన్నికకు సంబంధించి అనెక్సర్ 1, 2 ఇచ్చేందుకు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీకి చెందిన న్యాయవాది కురుబ నాగిరెడ్డి, రాప్తాడు వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు, పార్టీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డిపై టీడీపీ అల్లరిమూకలు దాడికి దిగాయి. రామగిరి ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకోగానే.. పక్కా ప్రణాళికతో కొందరు గుంపుగా వచ్చి భౌతికదాడికి దిగారు. అంతటితో ఆగకుండా ఎంపీడీఓ కార్యాలయంలోకి తోసుకెళ్లి బంధించారు. లోపల ఎంపీడీఓను సైతం చితకబాదినట్లు సమాచారం. అనెక్సర్ 1, 2 పత్రాలను చించేశారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతల వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. వాహనాల్లోకి మారణాయుధాలు విసిరి.. అక్రమ కేసులు బనాయించాలనే యత్నం చేశారు. అనంతరం పోలీసులు వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఎస్ఐ సుధాకర్ యాదవ్ దాడి చేసిన వారిని వదిలేసి..తమ అనుమతి లేనిదే ఎందుకొచ్చారంటూ బాధితులపైనే ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న రామగిరికి చేరుకుని..విచారణ చేపట్టారు.

మెజార్టీ లేకపోయినా..

రామగిరి మండలంలో మొత్తం పది ఎంపీటీసీ స్థానాలు ఉండగా... నసనకోట మినహా తొమ్మిదింట (పేరూరు-1, పేరూరు-2, పెద్దకొండాపురం, ఎంసీపల్లి, రామగిరి, పోలేపల్లి, గంతిమర్రి, మాదాపురం, కుంటిమద్ది) వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే విజయం సాధించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత పంచాయతీ అయిన నసనకోటలో మాత్రం టీడీపీ అభ్యర్థి గెలిచాడు. రామగిరి ఎంపీపీ పదవి జనరల్ మహిళకు రిజర్వు కావడంతో వైఎస్సార్‌సీపీకి చెందిన మీసుగ నాగమ్మ ఆ పదవిలో కొనసాగారు. అయితే..ఆమె ఈ ఏడాది జనవరిలో అకాల మరణం పొందడంతో ప్రస్తుతం ఎంపీపీ ఎన్నిక అనివార్యమైంది. మండలంలో ఐదుగురు మహిళా ఎంపీటీసీ సభ్యులు ఉండగా.. అందరూ వైఎస్సార్‌సీపీ వారే. అయినప్పటికీ ఎంపీపీ పదవిని టీడీపీ పరం చేయాలని పరిటాల సునీత తాపత్రయ పడుతున్నట్లు స్పష్టమవుతోంది. సామరస్యంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎంపీపీ ఎన్నికను ఎదుర్కొనే సత్తా లేక దాడులకు తెగబడుతున్నారు.

అక్రమ కేసులు.. అరెస్టులకు ప్లాన్

అధికారాన్ని అడ్డు పెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి.. అరెస్టు చేయించాలని టీడీపీ నేతలు ప్లాన్ వేసినట్లు బుధవారం రామగిరి ఘటనా దృశ్యాలను బట్టి స్పష్టమవుతోంది. వైఎస్సార్‌సీపీ నేతలను ఎంపీడీఓ కార్యాలయంలో బంధించి.. బయట ఉన్న వాహనాలను ధ్వంసం చేయడంతో పాటు వాటిలోకి మారణాయుధాలు చేర్చడం అనుమానాలకు తావిస్తోంది.

'తోపుదుర్తి'ని అడ్డగించిన పోలీసులు

వైఎస్సార్‌సీపీ నేతలపై దాడి సమాచారం అందుకున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రామగిరి బయలుదేరారు. అయితే..మార్గ మధ్యంలో సోమందేపల్లి క్రాస్ వద్ద పెనుకొండ డీఎస్పీ వై.వెంకటేశ్వర్లు అడ్డుకుని సోమందేపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. శాంతి భద్రతల దృష్ట్యా రామగిరికి వెళ్లడానికి అనుమతి లేదని చెప్పారు. సుమారు మూడు గంటల సేపు స్టేషన్‌లోనే కూర్చోబెట్టారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అక్కడికి చేరుకుని.. పోలీసులతో వాగ్వాదం చేశారు. పరామర్శకు వెళ్లేందుకు కూడా అనుమతించకపోవడం సబబు కాదన్నారు.

ఎంపీపీ పదవి ఆశించడం హాస్యాస్పదం

రామగిరి మండలంలో మొత్తం పది ఎంపీటీసీ స్థానాలకు గానూ ప్రజలు కేవలం ఒక్క సీటు మాత్రమే టీడీపీకి ఇచ్చారు. అయినా ఎంపీపీ పదవి ఆశించడం హాస్యాస్పదం. ప్రజాక్షేత్రంలో గెలవడం చేతకాక.. దొడ్డిదారిలో పదవులు కావాలనే ఆశ ఎందుకు? మెజారిటీ సీట్లు లేనప్పుడు ఎన్నికలకు రావడమే అనవసరం. ప్రత్యర్థి పార్టీ నేతలను బెదిరింపులకు గురి చేయడం రాజకీయం కాదు. ఎస్పీ నిష్పక్షపాతంగా పని చేస్తారనే నమ్మకం ఉన్నప్పటికీ రామగిరి ఎస్ఐ సుధాకర్‌యాదవ్ మాత్రం పూర్తిగా పరిటాల సునీత కనుసన్నల్లోనే ఉన్నట్లు స్పష్టమవుతోంది. రామగిరి వెళ్లాల్సిన ప్రతిసారీ పోలీసుల అనుమతి తీసుకోవాలని ఏ రాజ్యాంగంలోనూ లేదు. రామగిరి మండలం పాకిస్తాన్‌లో లేదు కదా?! ప్రశాంతంగా ఉండే ప్రాంతాలను దోపిడీ, రౌడీరాజ్యంగా మార్చడమే పరిటాల కుటుంబం పని. ఎంపీటీసీ సభ్యుల పిటిషన్ మేరకు ఎన్నిక పూర్తయ్యే వరకు రక్షణ కల్పించాలని హైకోర్టు నుంచి కూడా ఉత్తర్వులు వచ్చాయి. ఎంపీపీ ఎన్నికతో పరిటాల సునీతకు ఏం అవసరం ఉంది? మహిళా అభ్యర్థులు టీడీపీలో లేరు. ఎన్నికల హాలులో కూర్చుని వెళ్లకుండా.. కొట్లాట, గలాట ఎందుకు? గతంలో సునీత మంత్రిగా ఉన్న సమయంలోనూ కనగానపల్లి ఎంపీపీ ఎన్నిక విషయంలో ఇద్దరు మహిళా సభ్యులపై చేయి చేసుకున్న ఘటన అందరికీ గుర్తుంది. పరిటాల సునీతను చంద్రబాబు నియంత్రించాలి.
– తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే

గంజాయి విక్రేతకు పదేళ్ల జైలు

అనంతపురం: గంజాయిని విక్రయించడమే కాకుండా, సరఫరా చేస్తున్న వ్యక్తికి 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ అనంతపురం ఒకటో అడిషనల్ జిల్లా జడ్జి కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివరాలు.. ఒడిశా రాష్ట్రం కోడల గ్రామానికి చెందిన భగభాన్ పోలై 2023 డిసెంబర్ 18న రెండు బ్యాగుల్లో 32 కేజీల గంజాయిని గుజరాత్ రాష్ట్రానికి తరలిస్తూ మార్గమధ్యంలో గుంతకల్లులో దిగాడు. రైల్వేస్టేషన్‌లో వెయిటింగ్ రూంలో ఉన్న అతడిని గుంతకల్లు ఆర్‌పీఎఫ్ పోలీసులు తనిఖీ చేయగా గంజాయి దొరికింది. దీనిపై అసిస్టెంట్ ఇంజినీరింగ్ ఆఫీసర్ ఓబులేసు ఫిర్యాదు మేరకు సీఐ బీవీ నగేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతపురం ఒకటో అడిషనల్ జడ్జి కోర్టులో చార్జ్‌షీటు దాఖలు చేశారు. నలుగురు సాక్షులను విచారించిన జడ్జి సత్యవాణి బుధవారం తీర్పు వెలువరించారు. నిందితుడు భగభాన్ పోలైకు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున ఈశ్వరమ్మ వాదించారు. గుంతకల్లు ఆర్‌పీఎఫ్ కోర్టు పీఎస్ ఇర్షాద్, ఏఎస్ఐ శ్రీనివాసులు (కోర్టు వ్యవహారాలు) సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరిచి ముద్దాయికి శిక్ష పడేలా తమ వంతు కృషి చేశారు.

క్లుప్తంగా

'అనంత' లఘుచిత్రానికి జాతీయ పురస్కారం


అవార్డునందుకుంటున్న నిర్మాత కేపీ రాజు

అనంతపురం కల్చరల్: బాల్య వివాహాలతో ఉత్పన్నమయ్యే సమస్యలు, బాలికావిద్య ప్రయోజనాల ఇతివృత్తంతో జిల్లా వాసులు నిర్మించిన 'బడి పిలుస్తోంది' లఘుచిత్రం జాతీయ అవార్డును కైవసం చేసుకుంది. న్యూఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఆర్‌సీ భవన్ వేదికగా బుధవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డుతో పాటు రూ.1.50 లక్షల నగదు పురస్కారాన్ని చిత్ర నిర్మాత కేపీ రాజు, దర్శకుడు తరిమెల రాజు, కెమెరామెన్ లింగాల పవన్ అందుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసి ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇండియా చైర్‌పర్సన్ జస్టిస్ రామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అనంత వాసుల కృషిని అభినందించారు. కార్యక్రమంలో యూనిట్ సభ్యులు సుధాకర్, శంకరరెడ్డి, శ్రీపాద పాల్గొన్నారు.

ఏపీఎఫ్‌ఆర్ నమోదులో నిర్లక్ష్యం తగదు


శెట్టూరులో వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

శెట్టూరు: మండలంలో రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య (ఏపీఎఫ్‌ఆర్) నమోదులో నిర్లక్ష్యం వీడాలని వ్యవసాయాధికారులను జేడీఏ ఉమామహేశ్వరమ్మ హెచ్చరించారు. బుధవారం శెట్టూరు మండలం యాటకల్లు, శెట్టూరు, ములకలేడు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఏపీఎఫ్‌ఆర్ నమోదులో మండలం ఎందుకు వెనుకబడి ఉందనే విషయంపై ఆరా తీశారు. మండల వ్యాప్తంగా సుమారు 11,499 మంది రైతులు ఉండగా ఈ నెల 29న చివరి గడువు కాగా, ఇప్పటి వరకూ కేవలం 4వేల మందికి మాత్రమే ఏపీఎఫ్‌ఆర్ నమోదు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ములకలేడులో రైతు సేవా కేంద్రంలో జేడీఏ, ఏఓ వాసుకీరాణి వెళ్లి రైతులతో మాట్లాడకుండా కేవలం ఫొటోలు మాత్రం తీసుకుని వెళ్లడాన్ని ఎంపీటీసీ లింగప్ప, రైతులు డీడీమూర్తి, గోవిందప్ప, మల్లూరు కిష్టప్ప మీడియాతో అసహనం వ్యక్తం చేశారు. .

హంద్రీ-నీవా డిప్యూటీ ఎస్ఈగా ఉమామహేశ్వరరావు

అనంతపురం సెంట్రల్: హంద్రీ-నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు డిప్యూటీ ఎస్ఈగా ఉమామహేశ్వరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ కడప జిల్లా ఇరిగేషన్ డీఈగా పనిచేస్తున్న ఆయనకు ప్రభుత్వం పదోన్నతి కల్పించి హంద్రీ-నీవా డిప్యూటీ ఎస్ఈగా నియమించింది. ఈ సందర్భంగా ఆయనకు హంద్రీ-నీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

ఇంజినీరింగ్‌లో ఆనర్స్



- బీటెక్ మూడు, నాలుగు సంవత్సరాల విద్యార్థులకు నూతన సిలబస్
- 18 క్రెడిట్లు అదనంగా చదివితే ఆనర్స్ డిగ్రీ ప్రదానం
- 40 శాతం క్రెడిట్లు ఆన్‌లైన్ విధానంలో చదివే సౌలభ్యం

అనంతపురం: 'ఏఐసీటీఈ' మార్గదర్శకాలకు అనుగుణంగా 2023లో జేఎన్‌టీయూ (ఏ) బీటెక్ కోర్సుల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. వచ్చే 20 ఏళ్ల సాంకేతికను అందిపుచ్చుకునేలా సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) తదితర వాటిని ఇంజినీరింగ్ కోర్సుల్లో బోధనాంశాలుగా చేర్చారు. అప్పట్లో అడ్మిషన్ పొందిన విద్యార్థులు ప్రస్తుతం మూడో సంవత్సరం చదువుతున్నారు. ఈ క్రమంలో మూడు, నాలుగు సంవత్సరాల్లో చదవాల్సిన పాఠ్యాంశాలకు తాజాగా రూపకల్పన చేశారు. బీటెక్ కోర్సుల్లోని అన్ని బ్రాంచ్‌ల్లోనూ మైనర్, ఆనర్స్ డిగ్రీ విధానం అమలు చేయనున్నారు. ఏడాదికి 160 క్రెడిట్లు చదవాల్సి ఉంటుంది. వీటితో పాటు అదనంగా 18 క్రెడిట్లు చదివితే ఇంజినీరింగ్ డిగ్రీతో పాటు ఆనర్స్, మైనర్ డిగ్రీని ప్రదానం చేస్తారు. ప్రతి విభాగంలో క్వాంటం కంప్యూటింగ్‌లో మైనర్ డిగ్రీని తప్పనిసరి చేశారు. 40 శాతం క్రెడిట్స్ ఆన్‌లైన్‌లోనే పూర్తి చేయొచ్చు. ఐదు రోజుల వర్క్‌షాప్, ప్రతి సెమిస్టర్‌లోనూ ఎక్స్‌పర్ట్ లెక్చర్, క్రెడిట్ డిపాజిట్ విధానం అమలు చేశారు. ప్రతి విద్యార్థి ఫైనలియర్ రెండో సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్, మూడో సెమిస్టర్ సమ్మర్ బ్రేక్‌లో ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. 2025-26 విద్యా సంవత్సరంలో మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ సిలబస్ వర్తిస్తుంది.

అపార అవకాశాలు

క్వాంటమ్ కంప్యూటింగ్, జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక టెక్నాలజీతో 2030 నాటికి 10 లక్షల ఉద్యోగాల సృష్టి జరుగుతుందని ఓ ప్రముఖ ఐటీ సంస్థ ఇటీవలే వెల్లడించింది. ఆరోగ్య సంరక్షణ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్, రిటైల్, ఆటోమోటివ్, తయారీలో ఏఐ/ఎంఎల్ సాంకేతిక మోసాన్ని గుర్తించడం, నిర్ధారణ, నాణ్యత నియంత్రణకు క్వాంటం కంప్యూటింగ్ దోహదం చేస్తుంది.

- ఒకే సమయంలో రెండు పనులు చేయడం సాధ్యమా.. అని అడిగితే చాలా కష్టమని చెబుతాం. కానీ క్వాంటమ్ కంప్యూటింగ్‌లో క్యూబిట్స్ ఏకకాలంలో చాలా పనులు చేయగలవని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.
- ఇది ఎంటాంజిల్‌మెంట్, సూపర్‌పొజిషన్స్ అనే అంశాల మూలంగా ఒకే సమయంలో వేల సంఖ్యలో గణనలు చేయగలదు. సంప్రదాయ కంప్యూటర్లు బైనరీ బిట్స్ అంటే 0 లేదా 1 రూపంలో సమాచారాన్ని నిల్వ చేసుకుంటాయి. దాన్ని విశ్లేషిస్తాయి. అదే క్వాంటమ్ కంప్యూటర్లు క్యూబిట్స్ సాయంతో పనిచేస్తాయి. ఇది 1, 0 లేదా ఒక సమయంలో రెండు రూపాల్లోనూ ఉండొచ్చు. అంటే ఒక పని పూర్తి కాకుండానే మరో పనిని మొదలు పెడతాయి. క్వాంటమ్ రేణువులు 'ఎంటాంజిల్‌మెంట్' అనే విచిత్రమైన ప్రవర్తనను ప్రదర్శిస్తాయి. ఎంటాంజిల్ అయినప్పుడు అవి ఎంత దూరంలో ఉన్నా ఒకదాంతో మరొకటి అనుసంధానమవుతాయి. అదీ లక్షలాది మైళ్ల రూపంలో ఉన్నాసరే ఎంటాంజిల్ అవుతాయి. ఈ ప్రక్రియలో క్యూబిట్ల సంఖ్యను పెంచితే క్వాంటమ్ పరికరాల సామర్థ్యం అనూహ్యంగా పెరిగిపోతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ పరిజ్ఞానం ప్రయోగశాలలను దాటుకుని వాడకానికి దగ్గరవుతోంది. మందుల ఆవిష్కరణ, క్రిప్టోగ్రఫీ, వాతావరణ శాస్త్రం, పదార్థ విజ్ఞానం వంటి ఎన్నో రంగాల్లో ఇది సంచలన మార్పులకు కారణం కాగలదని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో క్వాంటమ్ కంప్యూటింగ్‌ను మైనర్ డిగ్రీగా చదవాలని తప్పనిసరి చేశారు. అన్ని బ్రాంచుల వారు చదవాల్సిందేనని స్పష్టం చేశారు.

అదనంగా 18 క్రెడిట్లు చదివితే ఆనర్స్ డిగ్రీ..



ఇప్పుడు ఉన్న క్రెడిట్లకు అదనంగా మరో 18 క్రెడిట్లు చదివితే మైనర్స్, ఆనర్స్ డిగ్రీ ప్రదానం చేస్తాం. క్వాంటం కంప్యూటింగ్ మైనర్ డిగ్రీని ప్రవేశపెట్టనున్నాం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్‌లో మార్పులు చేర్పులు చేశాం.

– ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం.

నేడు 'సతామి'


ముస్తాబైన అనంతపురంలోని గుత్తి రోడ్డులో ఉన్న మసీదు

అనంతపురం కల్చరల్ : రంజాన్ మాసంలో వచ్చే లైలతుల్ ఖదర్‌కు (సతామి) ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ వేడుకను బడీరాత్ అని, సతామి అని కూడా పిలుస్తుంటారు. 'భగవంతుడా నీవు మన్నించే గుణం కలవాడివి, తెలియక చేసిన తప్పులను మన్నించు' అని కోరుతూ గురువారం సతామిని భక్తిశ్రద్ధలతో జరిపేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. పవిత్ర ఖురాన్ అవతరించిన రాత్రి కావడంతో రాత్రంతా ప్రార్థనలతో జాగరణ చేస్తూ ఆధ్యాత్మిక చింతనతో గడపడానికి వీలుగా మసీదులను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. చేస్తున్నారు. సతామిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా జన్మజన్మల పుణ్యఫలం ఈ ఒక్క రాత్రితో పొందగలరని మతపెద్దలంటున్నారు. నగరంలోని పాతూరు జామియా మసీదు, సప్తగిరి సర్కిల్ ఈద్గా మసీదు, పీటీసీ ఎదురుగా ఉన్న చాందినీ మసీదు, రెండోరోడ్డు బహువుద్దీన్ మసీదుల్లో విశేష కార్యక్రమాలను చేపడుతున్నట్లు మసీదు కమిటీల ప్రతినిధులు తెలిపారు.

నెట్టికంటుడి హుండీ ఆదాయం లెక్కింపు

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీ కానుకల ద్వారా సమకూరిన ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. మొత్తం 103 రోజులకు గానూ రూ.66,85,838 లక్షల నగదు, అన్నదానం హుండీ ద్వారా రూ.63,447 నగదు, 37 అమెరికన్ డాలర్లు, నాలుగు గ్రాముల బంగారు, 1.900 కిలోల వెండి సమకూరినట్లు ఆలయ ఈఓ కె.వాణి తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వీరభద్ర సేవా సమితి, హనుమాన్ సేవా సమితి, రాఘవేంద్ర సేవా సమితి, శ్రీరామ సేవాసమితి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

ఫైనల్‌కు కొల్లేరు, గోదావరి


ఫుట్‌బాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

అనంతపురం: ఆర్డీటీ క్రీడా గ్రామంలో జరుగుతున్న ఏపీ సూపర్‌కప్ ఫుట్‌బాల్ ఫైనల్‌కు కొల్లేరు, గోదావరి జట్లు చేరాయి. పాయింట్ల పట్టికలో కొల్లేరు క్లబ్ 18 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. గోదావరి క్లబ్ జట్టు 15 పాయింట్లు సాధించి రెండో స్థానం పొందింది. పాయింట్ల పట్టికలో టాప్-2లో ఉన్న జట్లకు ఫైనల్ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. మొత్తం 8 జట్లలో తుంగభద్ర కేవలం నాలుగు పాయింట్లు సాధించి చివరి స్థానం దక్కించుకుంది.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న దశరథరామిరెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి పంట పొలాలకు నీరు ఇవ్వాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎన్జీఓహోమ్‌లో జల సాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి జలాలను బనకచెర్లకు తీసుకువచ్చి రాయలసీమలో ప్రతి ఎకరాకూ నీళ్లు పారిస్తామంటూ సీఎం చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కృష్ణా నదిలో ఏటా వంద టీఎంసీలు నీరు సముద్రం పాలవుతున్నాయని, ఈ వృథాను అరికట్టేందుకు రాయలసీమ జిల్లాల్లో తగినన్ని ప్రాజెక్టులు, రిజర్వాయర్లు నిర్మించి, ఆ నీటిని మళ్లించాలన్నారు. అలా కాకుండా పోలవరం నుంచి గోదావరి జలాలను బనకచెర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు తరలించి అక్కడి నుంచి రాయలసీమకు నీటిని ఇస్తామనడం వెనుక పాలకుల స్వార్థం ఉందన్నారు. 2014-19 సంవత్సరాల మధ్య రూ 68 వేల కోట్లు సాగునీటి రంగానికి చంద్రబాబు ఖర్చు చేశారన్నారు. ఇందులో రాయలసీమకు రూ.12,400 కోట్లు ఖర్చు చేశామని చెప్పడం చూస్తుంటే సాగునీటి బడ్జెట్లో రాయలసీమకు 18 శాతం మాత్రమే ఖర్చు పెట్టినట్లుగా అర్థమవుతోందన్నారు. మిగిలిన 82 శాతం కోస్తా ప్రాంతానికి ఖర్చు పెట్టారంటే అది ఎవరి ప్రయోజనాలకు అర్థం చేసుకోవచ్చునన్నారు. ఏపీ అంటే కేవలం అమరావతి, పోలవరం అన్నట్టుగా అభివృద్ధి మొత్తాన్ని ఒకే ప్రాంతానికి కేంద్రీకరించి రాష్ట్రంలోని వెనకబడిన ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. హంద్రీ-నీవా ప్రయోజనాలకు సమాధి కట్టే కాలవ లైనింగ్ పనులు వెంటనే రద్దు చేయాలని, ప్రధాన కాలువను పది వేల క్యూసెక్కుల నీటి ప్రవాహ సామర్థ్యానికి వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జలసాధన సమితి ప్రధాన కార్యదర్శి గంగిరెడ్డి, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇండ్ల ప్రభాకర్ రెడ్డి, కార్యదర్శి నాగరాజు, సహాయకార్యదర్శి కృష్ణ, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఉపేంద్ర, సహాయ కార్యదర్శి ప్రకాష్, ఇఫ్ టు అధ్యక్షుడు ఏసురత్నం, నాయకులు వెంకటేష్, రాహుల్, లక్ష్మి, విద్యార్థి సంఘం నాయకులు వీరేంద్ర, వేమయ్య, శంకర్, పెద్దన్న, వీర నారప్ప, చంద్ర, వైఎస్ రెడ్డి , రామకృష్ణా రెడ్డి, శేషాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయితీ రుణాలకు రాజకీయ గ్రహణం

- సిఫార్సు ఉన్న వారికే రుణాలు
- ఇంటర్వ్యూలకు అందని సమాచారం


బీసీ కార్పొరేషన్ కార్యాలయం

అనంతపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం అందించే రాయితీ (సబ్సిడీ) రుణాలకు రాజకీయ గ్రహణం పట్టుకుంది. యూనిట్ విలువలో సగం మాకు ఇస్తే కచ్చితంగా రుణం వచ్చేలా చూస్తామని కూటమి పార్టీల నాయకులు బహిరంగంగా దందాకు తెర లేపారు. ఆ మేరకు తాము సిఫార్సు చేసిన వారిని మాత్రమే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలంటూ అధికారులకు హుకుం జారీ చేస్తున్నారు. చేసేది లేక అధికారులు వారు చెప్పినట్టే వింటున్నారు. దీంతో అర్హులైన లబ్ధిదారులకు అన్యాయం జరుగుతోంది. అనంతపురం జిల్లాలో 2,369 స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు కోసం 22,945 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 1,472 యూనిట్ల కోసం 14,031 మంది దరఖాస్తు చేసుకున్నారు. అనంతపురం జిల్లాలో జనరిక్ మెడికల్ స్టోర్ల యూనిట్లకు 51 మంది, శ్రీ సత్యసాయి జిల్లాలో 67 మంది దరఖాస్తు చేసుకున్నారు. చాలాచోట్ల ఇతర పార్టీలకు చెందిన వారు, సామాన్యులు దరఖాస్తు చేసుకున్నారన్న నెపంతో కనీసం ఇంటర్వ్యూలకు కూడా సమాచారం అందించలేదు.

సమాచారమే అందలేదు

పాడి పరిశ్రమ ఏర్పాటు కోసం రూ.5 లక్షల సబ్సిడీ లోన్‌కు దరఖాస్తు చేసుకున్నా. అయితే ఇంటర్వ్యూ ఉన్నట్లు నాకు సమాచారమే అందలేదు. ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి అడిగితే అక్కడ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. కార్యాలయానికి రావాల్సిన అవసరం లేదని, కూటమి నాయకులను కలవాలని సలహా ఇచ్చారు. – రామాంజనేయులు (పేరు మార్చాం), ఎ.నారాయణపురం, అనంతపురం

మా ప్రమేయం లేదు..

సబ్సిడీ రుణాల లబ్ధిదారుల ఎంపిక విషయం మా ప్రమేయం లేదు. మండల పరిషత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ల సమక్షంలో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. రుణాలకు ఎంపికైన లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందిస్తాం.
– సుబ్రహ్మణ్యం, బీసీ కార్పొరేషన్ ఈడీ

చీనీ చెట్లు దగ్ధం

గార్లదిన్నె: మండలంలోని కొట్టాలపల్లిలో రైతు రమేష్ కృష్ణ తనకున్న రెండు ఎకరాల్లో సాగు చేసిన చీనీ చెట్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. మంగళవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి దాదాపు 60 చీనీచెట్లు, డ్రిప్పు పైపులు, వైర్లు కాలిపోవడంతో రూ.40 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపాడు. కాగా, విషయాన్ని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా తెలియజేస్తే కనీసం తోటను పరిశీలించేందుకు కూడా రాకపోవడంపై సీపీఐ నేత శ్రీనాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత రైతును ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

డీలిమిటేషన్‌తో దక్షిణాదికి నష్టం


సమావేశంలో మాట్లాడుతున్న జగదీష్

అనంతపురం అర్బన్: కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న డీలిమిటేషన్ ప్రక్రియతో దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం చేకూరుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియను తక్షణమే విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి అధ్యక్షతన బుధవారం స్థానిక నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో జరిగిన సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. డీలిమిటేషన్‌లో భాగంగా జనాభా ప్రాతిపదికన పార్లమెంట్‌లో సీట్లు దక్షిణాది రాష్ట్రాలకు కేవలం 29 పెరిగితే ఉత్తరాది రాష్ట్రాలకు 129 పెరుగుతాయన్నారు. దీంతో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నుంచి వచ్చే నిధులు గణనీయంగా తగ్గుతాయన్నారు. అలాగే పార్లమెంట్‌లో చట్టాల రూపకల్పనలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, రూపొందే చట్టాల వల్ల ఇక్కడి ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. డీలిమిటేషన్ ద్వారా దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న రాజకీయ దాడిని ఎదుర్కొనేందుకు తిరుగుబాటు బాటను ఎంచుకున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే విధంగా కాకుండా ఐక్యతతో ఉండేలా కేంద్రం వ్యవహరించాలన్నారు. అలాగే రాష్ట్రంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకూ పోరాటాలు సాగిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యదర్శివర్గ సభ్యులు సంజీవప్ప, శ్రీరాములు, రామకృష్ణ, గోపాల్, కేశవరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బాగాలేదంటున్నా.. ఎస్ఐ చితకబాదాడు


చికిత్స పొందుతున్న చిన్న నారాయణరెడ్డి

అనంతపురం మెడికల్: తనకు ఆరోగ్యం బాగో లేదని చెప్పినా వినకుండా పెద్దపప్పూరు ఎస్ఐ నాగేంద్ర చితకబాదాడంటూ చిక్కేపల్లికి చెందిన రైతు చిన్న నారాయణరెడ్డి ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతపురంలోని సర్వజనాస్పత్రి ఎంఎం వార్డులో అడ్మిషన్‌లో ఉన్న ఆయన బుధవారం 'సాక్షి'తో మాట్లాడారు. తనకు సొంత స్థలంలో రస్తా విషయంగా చిన్ననారాయణరెడ్డికి స్థానికంగా ఉండే జగన్నాథరెడ్డి మధ్య ఈ నెల 22న వాగ్వాదం జరిగింది. 23న పెద్దపప్పూరు పీఎస్‌కు చిన్ననారాయణరెడ్డి, ఆయన సోదరుడు రామేశ్వరరెడ్డిను ఎస్ఐ నాగేంద్ర పిలిపించి బెదిరింపులకు దిగారు. రస్తా విషయంలో అతి చేస్తున్నారంటూ అంటూ చిన్ననారాయణరెడ్డి కుటుంబీకులను దుర్భాషలాడారు. ఆ సమయంలో ఎస్ఐ తీరును చిన్ననారాయణరెడ్డి ఆక్షేపించడంతో ఆగ్రహంతో మరింత రెచ్చిపోయి చితకబాదాడు. తనకు ఆరోగ్యం బాగోలేదని చెబుతున్నా వినకుండా కొట్టడంతో పీఎస్‌లోనే అపస్మారక స్థితిలో పడిపోయాడు. అనంతరం చికిత్స కోసం ఆయనను కుటుంబసభ్యులు సర్వజనాస్పత్రికి తీసుకురాగా ఆర్ఎంసీ కింద అడ్మిషన్‌లో ఉంచారు.

టీడీపీ నేత అండతో మత్తు మందు విక్రయం

- రాయదుర్గంలోని శ్రీవిజయలక్ష్మి మెడికల్ స్టోర్‌లో అమ్మకాలు
- డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీల్లో బయటపడిన టోసెక్స్ సిరప్
- కాలేజీ విద్యార్థులే లక్ష్యంగా విక్రయాలు


మెడికల్ షాపును తనిఖీ చేస్తున్న జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న

రాయదుర్గంటౌన్: మత్తు కలిగించే టోసెక్స్ సిరప్‌ను అనధికారికంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో రాయదుర్గంలోని బళ్లారి రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న శ్రీవిజయలక్ష్మి మెడికల్ స్టోర్‌ను జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. టీడీపీ నాయకుడు చదం పశుపతనాథరెడ్డి అండతో ఆయన సోదరుడు హనుమానరెడ్డి అక్రమ దందా కొనసాగిస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో బిల్లులు లేకుండా కొనుగోలు చేసిన దాదాపు వెయ్యికిపైగా టోసెక్స్ సిరప్ బాటిళ్లను బల్క్‌గా అమ్ముతున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. అలాగే వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తుండడం, ఫార్మాసిస్ట్ లేకపోవడం లాంటి మరో రెండు కేసులనూ నమోదు చేసి యజమాని హనుమారెడ్డికి నోటీసు జారీ చేశారు. అనంతరం పోలీసులు, సచివాలయ వీఆర్‌ఓల సమక్షంలో పంచనామా చేసి నివేదిక సిద్ధం చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెడికల్ షాపును సీజ్ చేయనున్నట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కాగా, రెండు వారాల క్రితం కర్ణాటకలోని చిత్రదుర్గలో కాలేజీ విద్యార్థులకు టోసెక్స్ సిరప్ విక్రయిస్తూ ముగ్గురు వ్యక్తులు అక్కడి పోలీసులకు పట్టుబడ్డారు. విచారణలో తాము రాయదుర్గంలోని విజయలక్ష్మి మెడికల్ స్టోర్‌లో కొనుగోలు చేసినట్లుగా నిందితులు అంగీకరించారు. దీంతో అప్పట్లో హనుమారెడ్డిని చిత్రదుర్గ పోలీసులు అరెస్ట్ చేయగా ఇటీవల బెయిల్‌పై విడుదలై వచ్చాడు. కర్ణాటక పోలీసులు ఇచ్చిన సమాచారంతోనే విజయలక్ష్మి మెడికల్ స్టోర్‌ను తనిఖీ చేసినట్లుగా సమాచారం.

నేత్రదానంతో మరో ఇద్దరికి చూపు


రాఘవేంద్ర (ఫైల్)

ఉరవకొండ: ఈ నెల 25న కూడేరు మండలం బ్రాహ్మణపల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొని రాకెట్ల గ్రామానికి చెందిన మదమంచి రాఘవేంద్ర(52) మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన నేత్రాలను దానం చేయడం ద్వారా మరో ఇద్దరికి కంటి చూపును ఇచ్చేందుకు మృతుని భార్య లలిత, వారి కుటుంబసభ్యులు ముందుకు వచ్చారు. దీంతో బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఎల్‌వీ ప్రసాద్ ఐ హస్పిటల్ రాకెట్లకు చేరుకుని రాఘవేంద్ర మృతదేహం నుంచి నేత్రాలను సేకరించారు.

సెంట్రల్ వర్సిటీలో సమస్యలు పరిష్కరించండి


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

బుక్కరాయసముద్రం: మండలంలోని జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ విద్యార్థి సంఘాల నాయకుడు యశంత్ డిమాండ్ చేశారు. సమస్యలపై బుధవారం వర్సిటీ వద్ద విద్యార్థులు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. సెంట్రల్ వర్సిటీలో నెలకొన్న సమస్యలపై ఫిబ్రవరి 6వ తేదీ నుంచి ఇప్పటి వరకూ నాలుగు దఫాలుగా వినతి పత్రాలు సమర్పించినా ఫలితం దక్కలేదన్నారు. సెంట్రల్ యూనివర్సిటీలో ఫీజులు తగ్గించాలని అనేక మార్లు కోరినా పట్టించుకోవడం లేదన్నారు. దేశంలోని సెంట్రల్ యూనివర్సిటీలు ఒకే పరిధిలో ఉంటాయని, అయితే ఇతర ప్రాంతాల్లోని వర్సిటీల్లోని ఫీజులకు అనంతపురంలోని వర్సిటీలోని ఫీజులకు రూ.వేలల్లో వ్యత్యాసం ఉంటోందని తెలిపారు. హస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వడం లేదని, కాంట్రాక్టర్‌ను మార్చాలని కోరినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికల హస్టల్ వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు వెంకట్రావ్, యశ్వంత్, విలియం, ధనరాజ్, రాము, అమరేష్, అమర్, ధనుంజయ రావు తదితరులు పాల్గొన్నారు.

'ఫ్యాప్టో' నూతన కార్యవర్గం ఎన్నిక

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఫ్యాప్టో ప్రస్తుత చైర్మన్ సిరాజ్ అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పరిశీలకులుగా ఫ్యాప్టో రాష్ట్ర కో -చైర్మన్, రాష్ట్ర జేఏసీ కో చైర్మన్ జి.హృదయరాజు వ్యవహరించారు. చైర్మన్‌గా ఆర్.శ్రీనివాస నాయక్, సెక్రటరీ జనరల్‌గా పురుషోత్తం, కో చైర్మన్లుగా ఓబులేసు, లింగమూర్తి, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా గోవిందరాజులు, రమణారెడ్డి, వెంకటేశు, సెక్రటరీలుగా వెంకటరత్నం, ట్రెజరర్‌గా రెహమాన్, కులశేఖర్ రెడ్డి, నరసింహులు, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసరెడ్డి, మంజుల, సిరాజుద్దీన్, రామాంజనేయులు, శివశంకర్, లింగమయ్య గోపాలరెడ్డి, జయరామిరెడ్డి, కలీముల్లా, మల్లికార్జునను ఎన్నుకున్నారు. అనంతరం హృదయరాజు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా ఏప్రిల్ 2న కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. డీఏ మంజూరు, సరెండర్ లీవ్‌ల సమస్య పరిష్కారం, 12వ వేతన కమిషన్ నియామకం తదితర డిమాండ్ల సాధనలో భాగంగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్ జగన్‌తో భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలసిన మాజీ మంత్రి శైలజానాథ్, మేయర్ వసీం, మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రిజ్వాన్

అనంతపురం కార్పొరేషన్: విజయవాడలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అనంతపురం జిల్లా నేతలు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకులకు సూచించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సాకే శైలజానాథ్, మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగజ్‌ఘర్ రిజ్వాన్, రాష్ట్ర కార్యదర్శి వేమల నదీమ్, నాయకులు శివశంకర్ నాయక్, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి గోగో ఎలక్ట్రిక్ ఆటో

అనంతపురం సెంట్రల్: నగరంలో యోగనంది మోటార్స్ షోరూంలో బుధవారం బజాజ్ గోగో ఎలక్ట్రిక్ ఆటోను మార్కెట్‌లోకి విడుదల చేశారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ వాహనం ఎంతో నాణ్యమైనదని తెలిపారు. మంచి మైలేజ్ ఇస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో మేనేజర్ బాషా, సేల్స్ మేనేజర్ సురేష్, జోనల్ మేనేజర్ సుబ్రమణ్యం, సర్వీస్ మేనేజర్ ఎల్లామలయ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



సులోచన మృతదేహానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత

అనంతపురం కార్పొరేషన్: అనంతపురం మాజీ ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ తరిమెల కోనారెడ్డి సతీమణి తరిమెల సులోచన బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సులోచన మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పాస్టర్ ప్రవీణ్ మృతి మిస్టరీని తేల్చండి

అనంతపురం కల్చరల్: ప్రముఖ దైవజనుడు పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాలని ఐసీసీ రాష్ట్ర అధ్యక్షుడు కోటమలిగే ఆనంద్ బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రవీణ్ మరణం దిగ్భ్రాంతికి గురి చేసిందని.. సమగ్ర దర్యాప్తు చేపట్టి నిజానిజాలను వెల్లడించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రవీణ్ మృతిపై అక్కడ ఉన్నవారందరూ అనుమానం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. గతంలో ఆయనకు అనేక బెదిరింపు కాల్స్ వచ్చేవని.. వీటిని దృష్టిలో పెట్టుకుని విచారణ చేపట్టాలని సూచించారు. ప్రవీణ్‌కు రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమయ్యారని మండిపడ్డారు.


రంజాన్ తోఫా పంపిణీ



నిత్యావసరాల కిట్లను అందజేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అనంత రెడ్ డ్రాప్స్ చారిటబుల్ ట్రస్ట్, స్టార్ మెడికల్స్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉమానగర్‌లో రంజాన్ తోఫా పంపిణీ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మస్జిద్ ఏ సిద్ధిఖియా ఇమామ్ ఇమ్రాన్ రజ్వి, ముష్కిన్‌వల్లి ట్రస్ట్ చైర్మన్ సర్దార్ వలి తదితరులు నిరుపేదలకు నిత్యావసరాల కిట్లు అందజేశారు. కార్యక్రమంలో బాబ్జాన్, నూర్ మహ్మద్, అఫ్రీన్, బాబా ఆలీ, పవన్ సాయి, దాదు, రియాజు, షేక్షావలి, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 6 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ సిబ్బంది

అనంతపురం కల్చరల్: నగరంలోని మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో భద్రాచలాన్ని తలపిస్తూ పది రోజుల పాటు శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ అర్చకులు, భక్తమండలి సభ్యులు తెలిపారు. బుధవారం ఆలయంలో శ్రీరామనవమి వేడుకల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏప్రిల్ 6వ తేదీ నుంచి 15 వరకూ ఉత్సవాలు సాగుతాయన్నారు. నిత్యం ఉదయం విశేష పూజలు, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రికి వాహన ఊరేగింపు సేవలు జరుగుతాయన్నారు. 6, 11 తేదీల్లో ఉదయం ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణ మహోత్సవం, 13న పట్టాభిషేకం, 15న వసంతోత్సవంతో వేడుకలు ముగుస్తాయని పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం.. ఆరోగ్యం

- రంజాన్ మాసంలో నమాజ్‌కు ప్రాధాన్యత
- ఇమిడి ఉన్న ఆరోగ్య సూత్రాలు
- దువా ద్వారా మానసిక ప్రశాంతత



మసీదులో ఇఫ్తార్ విందు చేస్తున్న ముస్లింలు

అనంతపురం కల్చరల్: ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఆదేశానుసారం ప్రతి ముస్లిం రోజుకు ఐదు సార్లు నమాజ్ ఆచరిస్తారు. పద్నాలుగేళ్లు నిండిన వారందరూ విధిగా నమాజ్ చేయాలని ఇస్లాం చెబుతోంది. విడిదినాల కన్నా పవిత్ర రంజాన్ రోజుల్లో ఈ ప్రార్థనలకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. నమాజ్ అంటేనే అల్లాహ్‌ను ప్రార్థించడం, భగవంతుడి ప్రేమకు ప్రీతిపాత్రులు కావడం అని అందరూ భావిస్తారు. అయితే నమాజ్ వెనుక పెద్దలు సంపూర్ణ ఆరోగ్యాన్ని, క్రమశిక్షణను అలవడేలా దైవచింతనతో గడిపే వారికి చక్కటి ఆరోగ్యాన్నిచ్చే వ్యాయామ పద్ధతులను ఏర్పాటు చేశారు. నమాజ్‌లోని వివిధ భంగిమలు సంపూర్ణ ఆరోగ్యాన్ని ఎలా ప్రసాదిస్తాయో మత పెద్దలు నమాజ్ వేళల్లో వివరిస్తున్నారు.

నమాజులో వివిధ క్రియలు

నమాజ్‌లో తక్బీర్, రకాత్, ఆల్ ఖయాం, రుకూ, జల్సా, సజ్దా, ఖయాం, సలాం అనే క్రియలు ఉంటాయి. ప్రతి క్రియ వ్యాయామం సాగించేలా ఉంటుంది. సూర్యోదయం కన్నా ముందు 'ఫజర్ నమాజ్'తో దైవ ఆరాధన మొదలవుతుంది. క్రమం తప్పకుండా నమాజ్ చేసే వారికి రక్తపోటు, మధుమేహం వంటి రోగాలు దరిచేరవని పలు అధ్యయనాల్లో తేలిందని చెబుతారు.

సంతానోత్పత్తికి 'జల్సా'



రెండు కాళ్లను మడిచి మోకాళ్ల వరకు తాకిస్తూ వాటిపైన కూర్చుంటారు. ఈ క్రియ వజ్రాసనాన్ని పోలి ఉంటుంది. అంటే ఈ జల్సా క్రియ శరీరాన్ని వజ్రంలా గట్టిగా మారుస్తుంది. ఏకాగ్రత పెరగడం, జీర్ణక్రియ చక్కగా పని చేయడం దీని ద్వారా కలుగుతుంది. ముఖ్యంగా సంతానలేమితో బాధపడేవారికి ఈ క్రియ ఉపశమనం కల్గిస్తుంది.

నేత్రశక్తికి 'సలాం'



నమాజులో చివరి ఘట్టం సలాం. తలను ఒకసారి కుడివైపుకు తిప్పి, ఆ వెను వెంటనే మరోమారు ఎడమ వైపుకు తిప్పడాన్ని 'సలాం' అంటారు. నమాజ్ ఆచరించే సమయంలో రెండు భుజాలపైన దైవ దూతలు వేచి ఉండి భక్తులు చేస్తున్న మంచి చెడులను గమనిస్తుంటారనే భావనతో నమాజ్‌ను ముగిస్తారు.

కొవ్వును కరిగించే 'రుకూ'



రెండు చేతులను మోకాళ్లపై ఉంచుకుని నడుమును సమాంతరంగా వంచుతూ చూపును రెండు కాళ్ల బొటనవేళ్ల మధ్యన కేంద్రీకరిస్తారు. ఈ క్రియ ద్వారా ఉదర భాగానికి మంచి వ్యాయామం ఉంటుంది. గుండె, మెదడు సమాంతరంగా ఉంచడం ద్వారా జీర్ణాశయం పనితీరు మెరుగవుతుంది. అలాగే శరీరంలోని అనవసర కొవ్వును తగ్గిస్తుంది. వెన్నెముకకు కూడా ఎంతో మంచిది.

విశ్వశాంతి కోసం 'దువా'



అల్లాహ్ అనుగ్రహం కోసం చేసే కార్యక్రమాన్ని దువా అంటారు. ప్రతి నమాజ్ అనంతరం సూరాలను చదువుతూ చేసే దువా ద్వారా తమకు మానసిక ప్రశాంతత, వచ్చే ఆపదల నుంచి కాపాడమని ప్రార్థన చేస్తారు. మరో ముఖ్యమైన విషయం ఏమంటే దువా కేవలం తన స్వార్థానికే కాకుండా విశ్వమానవ శాంతి చేకూర్చమని కోరుకోవడం ఆనవాయితీగా మారింది.

కీళ్లనొప్పులను దూరం చేసే 'ఖయాం'



సజ్దా క్రియలోకి వెళ్లడానికి ముందు నిటారుగా నిలబడడాన్ని ఖయాం అంటారు. వెన్నెముక క్రమ పద్ధతిలో ఉంచడం వల్ల ఈ ప్రక్రియ ఒత్తిడిని దూరం చేస్తుంది. ముఖ్యంగా మోకాళ్ల నొప్పులను దూరం చేస్తుంది.

'అల్-ఖయాం'తో మంచి రక్తప్రసరణ



చేతులను కిందికి దించి నాభిపైన కట్టుకుంటారు. కుడిచేతి బొటన వేళ్లతో ఎడమ చేతి మణికట్టును నాభిపై ఉంచుకుంటారు. ఇలా కట్టుకోవడానికి అల్-ఖయాంకు పోవడానికి ముందు చేసే ప్రక్రియను 'రకాత్' అంటారు. ఈ క్రియ ద్వారా గుండెకు విశ్రాంతి లభిస్తుంది. ఆధ్యాత్మిక చింతనతో చేసే ప్రక్రియ వల్ల శరీరంలో రక్తప్రసరణ క్రమపద్ధతిలో ఉంటుంది.

'సజ్దా'తో అల్సర్ దూరం



ఈ క్రియలో పాదాలు, మోకాళ్లు, అరచేతులు, ముక్కు, నుదురు, నేతలను తాకుతాయి. అల్లాహ్ ఎదుట సాష్టాంగ ప్రణామం చేయడమే దీని ఉద్దేశం. ఈ క్రియ ద్వారా శరీరంలోని ప్రతి అవయవానికి రక్తప్రసరణ సమపాళ్లలో జరిగి ఆరోగ్యం మెరుగవుతుంది. భూమిలోని తరంగాలు మెదడును తాకి చురుకుదనం కలిగిస్తుంది. ముఖ్యంగా అల్సర్ నివారణకు ఇది దోహదపడుతుంది.

చేతులకు వ్యాయామం 'తక్బీర్'



నమాజ్ మొదలు పెట్టడానికి ముందు రెండు చేతులను చెవుల వరకు తీసుకెళ్లారు. దీన్ని తక్బీర్ అంటారు. దీనికి రెండు చేతులకు చక్కటి వ్యాయామం లభించి సాధన చేసేకొద్దీ చక్కటి శారీరక, మానసిక బలం ప్రాప్తిస్తుంది.

నమాజ్ అన్ని విధాలా ఉత్తమం



మనిషి జీవిత విధానం సాఫీగా సాగడానికి ఏర్పాటు చేసిన శారీరక, మానసిక వ్యాయామమే నమాజ్. నిత్యం ఐదు సార్లు చేసే నమాజ్ వల్ల క్రమశిక్షణాయుత జీవితం అలవాటుగా మారుతుంది. ఆధునిక పోకడలెన్ని ఉన్నా దైనందిన జీవితంలో నమాజ్‌ను ఓ భాగంగా మార్చుకోవాలి. అనుభవం ద్వారా మాత్రమే తెలుసుకోగలం.

– అబ్దుల్, ఇమామ్, ఈద్గా మసీదు

నిత్యం ప్రార్థనలు చేయాలి



ముస్లింల జీవితంలో నమాజ్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. దానికి తోడు పవిత్ర రంజాన్ మాసం వచ్చిందంటే మరింత భక్తిభావంతో నిత్య ప్రార్థనలు చేయాల్సి ఉంటుంది. ఉపవాసాలు ఉండటం, ఫజర్ నమాజ్ నుంచి రాత్రి తరావీ నమాజ్ వరకూ మనం ఇతరుల శ్రేయస్సును కాంక్షించి చేస్తే అల్లాహ్ అనుగ్రహం చాలా ఉంటుంది.

– హఫీజ్ రియాజ్ అహ్మద్, అనంతపురం

గుండెపోటుతో టెక్నికల్ అసిస్టెంట్ మృతి

రాప్తాడురూరల్: రాత్రి 11 గంటల వరకు గ్రామంలోని పీర్లచావిడి కట్ట మీద కూర్చుని అందరితో పిచ్చాపాటిగా మాట్లాడుతూ గడిపాడు. నిద్ర వస్తోందని వెళ్లి పడుకున్నాడు. ఆరాత్రే చివరి రాత్రి అయింది. తెల్లారిసరికే గుండెపోటుతో మృతి చెందాడు. ఈ విషాద ఘటన అనంతపురం రూరల్ మండలం కందుకూరులో చోటు చేసుకుంది. సర్పంచ్ ప్రశాంత్‌కుమార్ తండ్రి, టెక్నికల్ అసిస్టెంట్ లింగమయ్య (58) అకాల మరణంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. లింగమయ్య స్థానిక ఎస్‌సీఐ గోడౌన్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. మంగళవారం సాయంత్రం అనంతపురం నగరానికి వెళ్లి రాత్రి 7:30 గంటలకు ఇంటికొచ్చారు. భోజనం చేసి తర్వాత 9 గంటల నుంచి 11 గంటల వరకు పీర్లచావిడి కట్టమీద గ్రామస్తులతో కలిసి కూర్చుని మాట్లాడారు. తర్వాత ఇంటికి వెళ్లి నిద్రపోయారు. అంతే తెల్లవారుజామున భార్య లక్ష్మీదేవిపశువుల పాక వద్దకు వెళ్లి పాలు పిండేందుకని భర్తను పిలిచింది. ఎంతకూ స్పందన లేకపోవడంతో కుమారుడు ప్రశాంత్‌కుమార్ (సర్పంచ్)కు నాన్నను లేపి ఇక్కడికి రావాలని చెప్పింది. కుమారుడు బెడ్‌రూంలోకి వెళ్లి తండ్రిని ఎంత లేపినా లేవలేదు. స్థానికంగా ఉండే వైద్యుడిని పిలిపించి చూపగా...అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు.

రూపాయి ఆశించకుండా సేవ

ఎఫ్‌సీఐలో పని చేసే లింగమయ్య పశువైద్యంపై కూడా మంచి అవగాహన పెంచుకున్నారు. పశువులకు చిన్నచిన్న రోగాలకు ప్రాథమిక వైద్యం అందించేవారు. ఏ సమయంలోనైనా తమ పశువుకు అనారోగ్యం అయిందని చెబితే చాలు వెనుకాముందు ఆలోచించకుండా వెళ్లి సపర్యలు చేసేవారు. సమాచారం అందుకున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సంతాపం తెలియజేశారు. మంచి కార్యకర్తను కోల్పోవడం బాధాకరం అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, ఎంపీపీటీ సభ్యురాలు రాగే రేవతి పెద్దప్ప, వైస్ సర్పంచ్ ఓబులేసు, నాయకులు నరసింహారెడ్డి, సుదీర్ రెడ్డి, జయచంద్రారెడ్డి, కొండారెడ్డి, తదితరులు లింగమయ్య మృతదేహానికి నివాళులర్పించారు.

ధర్మభిక్షం ఆశయసాధనకు కృషి



ధర్మభిక్షం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చేతివృత్తిదారుల సమాఖ్య నాయకులు

అనంతపురం అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట వీరుడు బొమ్మగాని ధర్మభిక్షం ఆశయాలను కొనసాగిస్తామని చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి లింగమయ్య తెలిపారు. ధర్మభిక్షం వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లింగమయ్య మాట్లాడుతూ.. ధర్మభిక్షం ప్రజాసమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగించారన్నారు. ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్న ఆయన రెండేళ్ల కఠిన కారాగార శిక్ష అనుభవించారన్నారు. నేల మీద నడుస్తున్న ఆరడుగుల ఎర్రజెండా అంటూ పోల్చడం ధర్మభిక్షం పోరాట పటిమకు నిదర్శమన్నారు. కార్యక్రమంలో చేతివృత్తి దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి నాగప్ప, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, సీపీఐ నాయకులు రామకృష్ణ, గోపాల్, చిరంజీవి, సమాఖ్య నాయకులు రఘు, వీరాంజి, రామాంజనేయులు, శ్రీరాములు, లక్ష్మీనారాయణ, నరసింహులు, మల్లు శీన, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు ధర్మభిక్షం గౌడ్ ఆశయ సాధనే లక్ష్యంగా పని చేస్తామని గౌడ, ఈడిగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేంద్ర గౌడ్ అన్నారు. బుధవారం రేణుక ఎల్లమ్మ కల్యాణ మండపంలో ధర్మభిక్షం గౌడ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్ర గౌడ్ మాట్లాడుతూ.. గౌడ, ఈడిగల అభివృద్ధికి ధర్మభిక్షం గౌడ్ ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రేణుక ఎల్లమ్మ సొసైటీ చైర్మన్ నాగేశ్వర్ గౌడ్, మాజీ గౌడ, ఈడిగ సంక్షేమ సంఘం నాయకులు రామ్మోహన్ గౌడ్, నారాయణ స్వామి గౌడ్, ఈశ్వరయ్య గౌడ్, మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోల్ కొట్టు.. కప్పు పట్టు

- ఏపీఎల్ తరహాలో 'ఏపీ సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ'
- గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం గల క్రీడాకారులను వెలికి తీయడమే లక్ష్యం
- అన్ని ప్రాంతాలకూ సమాన ప్రాతినిధ్యం
- నేడు ఫైనల్ మ్యాచ్



అనంతపురం: క్రికెట్‌లో ఏపీఎల్ తరహాలోనే ఏపీ సూపర్‌కప్ నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం గల ఫుట్‌బాల్ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకు ఈ టోర్నీ వేదిక అవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ సూపర్‌కప్ టోర్నీకి శ్రీకారం చుట్టారు. ఈనెల 20 నుంచి మొదలైన పోటీలు 27వ తేదీ వరకూ ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్, అనంతపురంలో నిర్వహిస్తున్నారు. గురువారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 8 జోన్లు, 8 క్లబ్బులుగా ఏర్పాటు చేశారు. వంశధార ఫుట్‌బాల్ క్లబ్ (శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాలు), విశాఖపట్నం ఫుట్‌బాల్ క్లబ్ (విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామ రాజు జిల్లాలు), గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ (తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలు), కొల్లేరు ఫుట్‌బాల్ క్లబ్ (ఏలూరు, తూర్పుగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు), నల్లమల ఫుట్‌బాల్ క్లబ్ (గుంటూరు, ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలు), కోరమాండల్ ఫుట్‌బాల్ క్లబ్ (నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాలు) పెన్నా ఫుట్‌బాల్ క్లబ్ (కడప, శ్రీ సత్యసాయి, అన్నమయ్య జిల్లాలు) తుంగభద్ర క్రికెట్ క్లబ్ (అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాలు) ఏర్పాటు చేశారు. ఒక్కో క్లబ్ నుంచి ఆయా స్థానిక జిల్లాల నుంచి 11 మంది ఫుట్‌బాల్ క్రీడాకారులు, మరో 11 మంది ఇతర రాష్ట్రాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తారు. విజేత జట్టుకు రూ.5 లక్షల బహుమతి అందజేయనున్నారు.

అత్యుత్తమ వేదిక



చాలా మంది నైపుణ్యం గల క్రీడాకారులు ఉన్నారు. వారందరినీ ప్రొఫెషనల్‌గా తీర్చిదిద్దడానికి మంచి వేదిక ఏపీ సూపర్ కప్. క్రికెట్‌కు ఉన్న క్రేజ్ ఫుట్‌బాల్‌కు వస్తోంది. భవిష్యత్తులో ఫుట్‌బాల్‌కు దేశంలో మంచి ఆదరణ లభిస్తుంది. ఇప్పుడే ప్రపంచంలో ఫుట్‌బాల్‌కు మంచి క్రేజీ ఉంది. క్లబ్ స్థాయిలో ఆడుతూ రూ.లక్షల్లో ఫుట్‌బాల్ క్రీడాకారులు ఆర్జిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రొఫెషనల్‌గా స్కిల్డ్ పర్సన్స్ ఇలాంటి అవకాశాలను ఒడిసిపట్టుకోవాలి.

– సుధాకర్, రిటైర్డ్ డీఎస్‌డీఓ, శాప్ డైరెక్టర్

టోర్నీ నిర్వహించడం సంతోషదాయకం



ఏపీ సూపర్‌కప్‌ను అనంతలో నిర్వహించడం సంతోషదాయకం. టోర్నీ నిర్వహించడానికి ఆర్డీటీ సహకారం ఎంతో ఉంది. నైపుణ్యం గల క్రీడాకారులను వెలికితీయడమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా 8 ఫుట్‌బాల్ క్లబ్‌లుగా ఏర్పాటు చేశాం. అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులకు సమాన అవకాశాలను కల్పించే రీతిలో ఈ టోర్నీని తొలిసారిగా ప్రవేశపెట్టాం. నైపుణ్యం గల క్రీడాకారులకు అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో టోర్నీ నిర్వహణకు శ్రీకారం చుట్టిన ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటగిరి శ్రీధర్ కృషి ప్రశంసనీయం.

– వేణుగోపాల్, రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్

'కార్మికుల పక్షపాతి వైఎస్సార్‌సీపీ'

- రేపు వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న పార్టీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అన్ని వర్గాల అభ్యున్నతికి వైఎస్ జగనన్న వైఎస్సార్‌సీపీని స్థాపించారు. కార్మికుల పక్షపాతి వైఎస్సార్‌సీపీ అని ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 28న ట్రేడ్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు తరలిరావాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కార్మికులు, కులవృత్తుల వారు ఆర్థిక ప్రగతి సాధించేందుకు అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వివిధ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం ఆ పథకాలను విస్మరించిందన్నారు. కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తామని వెల్లడించారు. సమావేశంలో ట్రేడ్ యూనియన్ మాజీ అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్ పీరా, ట్రేడ్ యూనియన్ నగరాధ్యక్షుడు మార్కెట్ ఖాజా, కార్పొరేటర్ సంపంగి రామాంజనేయులు, నాయకులు ఎం.విశ్వనాథ్ రెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, వి.గంగాధర్, సంగమేష్, మణి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వెలుగుల్లో మసీదులు



సతామిని పురస్కరించుకుని బుధవారం రాత్రి నగరంలోని పలు మసీదులను సుందరంగా అలకరించారు. రెండవ రోడ్డులోని బావొద్దీన్ మసీదు, గుత్తి రోడ్డులోని ఆక్సా మసీదు విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోయాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

సీఐ కరుణాకర్ బదిలీ ఆపాలి

అనంతపురం: బుక్కరాయసముద్రం సీఐ కరుణాకర్ అక్రమ బదిలీని తక్షణమే ఆపాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా అడిషనల్ ఎస్పీ డీవీ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్‌లో సీఐ కరుణాకర్‌ను కొంత మంది దూషిస్తూ హెడ్ కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని బెదిరించారన్నారు. ఇందుకు సీఐ వారిని మందలించగా ఏకంగా పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేశారని తెలిపారు. సీఐ కరుణాకర్‌పై కక్ష గట్టి ఇలా చేశారని తెలిపారు. సీఐని తిరుపతి వీఆర్‌కు పంపడం సరికాదన్నారు. పూర్తిగా టూ మెన్ కమిటీ నిర్ణయం మేరకే సీఐపై ఎలా చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నారాయణ స్వామి, ఎం.సుదర్శన్ (ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎం.పక్కీరప్ప, బి.చంద్ర, సి.రామాంజనేయులు, ఆంజనేయులు, చిన్న పెద్దన్న, ఎం.పార్వతి, ఎస్.అంజి తదితరులు పాల్గొన్నారు.

చైతన్య సదస్సులు నిర్వహించాలి



ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితకు విన్నవిస్తున్న దృశ్యం

అనంతపురం: రేపటి పౌరులైన నేటి బాలల సమగ్రాభివృద్ధి దేశ భవిష్యత్తుకు ఎంతో అవసరమని రాజ్య మహిళా సమ్మాన్ అవార్డు గ్రహీత నల్లాని రాజేశ్వరి అన్నారు. బాలల హక్కులు-చట్టాలపై విద్యార్థులకు చైతన్య సదస్సులు నిర్వహించాలని కోరారు. బుధవారం ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనితను కలిసి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్ బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకులను అభివృద్ధి బాట పట్టించాలి

- మహాజనసభలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

అనంతపురం అగ్రికల్చర్: సహకార బ్యాంకులు, సహకార సొసైటీలను అభివృద్ధిబాట పట్టించడానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ)లో జరిగిన 128వ మహాజనసభకు పర్సన్‌ఇన్‌చార్జి హోదాలో ఆయన హాజరయ్యారు. డిపాజిట్ల సేకరణ, మొండిబకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. వాయిదామీరిన రుణాలకు లీగల్ కవరేజీ ఇవ్వాలని ఆదేశించారు. పర్సన్ ఇన్‌చార్జిలు తరచూ సంఘాలను సందర్శించి ఆర్థిక పరిపుష్టి సాధించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఏప్రిల్ నుంచి ప్రారంభం కానున్న 2025-26 ఆర్థిక సంవత్సరంలో సొసైటీలు, సహకార బ్యాంకుల్లో అన్ని రకాల సేవలు, కార్యకలాపాలు వందశాతం కంప్యూటరీకరణతో జరగాలన్నారు. అందిస్తున్న ఆధునిక సేవలు, రుణాలపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించి రైతులు, ఇతరత్రా ఖాతాదారులను పెంచుకోవాలన్నారు. ఉద్యోగులందరూ యూనియన్ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. 2025-26కు సంబంధించి రూ.167.50 కోట్ల అంచనాతో రూపొందించిన బడ్జెట్‌ను ఆమోదించారు. మహాజన సభలో సీఈఓ కే.సురేఖారాణి, రెండు జిల్లాల డీసీఓలు అరుణకుమారి, కృష్ణానాయక్, నాబార్డు డీడీఎం అనురాధ, సహకార సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు ప్రభుత్వం చర్యలు



వైద్య పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని జిల్లా క్షయ నివారణ సంస్థ కార్యాలయంలో బుధవారం ప్రారంభమైన క్షయ వ్యాధి సంక్రమణ పరీక్ష, సీవై-చర్మ పరీక్షలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో ఈ పరీక్షను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారిణి డాక్టర్ అనుపమ జేమ్స్ మాట్లాడుతూ.. క్షయని నిర్మూలించే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఇటువంటి పరీక్షలకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. ఈ పరీక్షలో సంక్రమణ నిర్ధారణ అయితే టీబీ జబ్బు రాకుండా ముందస్తుగా వాడే మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు.

పొగాకుతో అనర్థాలు



పొగాకు దుష్ఫలితాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: పొగాకు వాడకం అనర్థం. క్యాన్సర్, తదితర అనారోగ్య సమస్యలు వస్తాయని పొగాకు నియంత్రణ కార్యక్రమ సామాజిక కార్యకర్త శ్రీరాములు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని పీటీసీ సమీపంలో ఉన్న ఆటో స్టాండ్ వద్ద ఆటోడ్రైవర్లకు పొగాకు వాడకంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. బీడీలు, సిగరెట్లు, గుట్కా, పాన్ పరాక్, ఖైనీ, జర్దా తదితర వాటికి దూరంగా ఉండాలని సూచించారు. బహిరంగంగా పొగాకు తాగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

దాబాలు, హోటళ్లలో తనిఖీలు

అనంతపురం: జిల్లాలోని దాబాలు, హోటళ్లలో అక్రమంగా మద్యం వినియోగించకుండా బుధవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. దాబాల్లో మద్యం విక్రయించడం, అనుమతించడం నిషేధం. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న దాబాల్లో మద్యం వినియోగానికి అనుమతి లేదని పోలీసులు పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.